




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 298, పేజీలు - 08

గురువారం, ఏప్రిల్ 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






# కాంగ్రెస్ నేతలకు పదవుల జాతర

## - నామినేటెడ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు పూర్తి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న అంతర్గత పరిణామాలు, పాలనాపరమైన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం తన నివాసంలో అత్యంత కీలకమైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ భేటీలో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.

### నామినేటెడ్ పోస్టుల కోసం డిమాండ్లు

ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం నామినేటెడ్ పదవుల భర్తీ . గత కొంతకాలంగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాబితాను సిద్ధం చేయాలని సీఎం పార్టీ నేతలకు సూచించారు. ఇది కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అధిష్టానం భావిస్తోంది.



### అసంతృప్తి స్వరాలపై ఆరా తీసిన మీనాక్షి

పార్టీలో అక్కడక్కడా వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కొందరు సీనియర్ నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై

2లో..

# బీహార్‌లో కొత్త శకం

## - తొలి బీజేపీ సీఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం



పాట్నా (ప్రశ్న న్యూస్) బీహార్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యక్ష నాయకత్వానికి మార్గం సుగమమైంది. ప్రమాణ స్వీకారానికి ముందు

2లో..

# కేసీఆర్ మాస్ వార్నింగ్

## - డీలిమిటేషన్ పై కేంద్రానికి స్ట్రాంగ్ మెసేజ్

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ సంపూర్ణ మద్దతు
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహిళా రిజర్వేషన్ల పట్ల తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూనే, దాని ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే 'డీలిమిటేషన్' ప్రక్రియపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లోనే(2023) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళా సాధికారతకు తాము ఎప్పుడూ పెద్దపీట వేస్తామని, 2011లోనే అసెంబ్లీలో దీనిపై తీర్మానం చేశామని గుర్తుచేసిన ఆయన.. డీలిమిటేషన్ విషయంలో మాత్రం కేంద్రం అనుసరించబోయే వ్యూహంపై గట్టి హెచ్చరికలు జారీ చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, అభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు అది శాపంగా మారుతుందని కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేటీఆర్, హరీష్‌రావులతో



నిర్వహించిన కీలక భేటీలో ఆయన ఈ అంశంపై పూర్తి క్లారిటీ ఇచ్చారు.

2లో..

# మీ సేవ సెంటర్లలో భారీగా అక్రమాలు

## - దళారుల ఆగడాలు.. ఏసీబీ దాడులు

mee seva
easier, faster

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో మీ సేవ కేంద్రాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రోజున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు మీ సేవ కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మీ సేవ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నగరంలోని ఖైరతాబాద్, అల్వాల్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉన్న కొన్ని మీ సేవ సెంటర్లలో


2లో..

# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

## - ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన
- జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు





అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేగంగా అడుగులు వేస్తున్నారు. బుధవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా జూన్ నెలాఖరు నాటికి వెలిగొండ స్టేజ్-1 పనులను పూర్తి చేయాలని అధికారులకు డెడ్ లైన్ విధించారు.

### - పోలవరం.. పర్యాటక స్వర్గధామం

పోలవరం ప్రాజెక్టు కేవలం సాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా, ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రాజెక్టు పరిసరాల్లో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, షాపింగ్ ఏరియాలు, సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. పోలవరం నుండి పాపికొండలు, భద్రాచలం వరకు

2లో..

# బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం

- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమన్న కవిత
- కాంగ్రెస్ పాలనలో రైతులకు రైతు భరోసా లేదు, ఆర్థిక సాయం లేదు
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు.

2లో..

# కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమే

- కూటమి పాలనలో మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని విమర్శ
- జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- అధికారంలోకి రాగానే మత్స్యకారుల హక్కులు కాపాడతామని హామీ



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని,

2లో..

# రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది

- కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ కాదన్న జీవన్ రెడ్డి
- కేసీఆర్‌కు ప్రజలు అంటే గౌరవం ఉందని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ, జీవన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం ఆగడం లేదు. పార్టీకి గుడ్‌బై చెప్పిన జీవన్ రెడ్డి త్వరలోనే కారెక్కేందుకు రెడీ అవుతున్న వేళ తన మాటల దాడిని మరింత పెంచారు. అదే సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా జీవన్ రెడ్డి లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలోనే మంగళవారం జగిత్యాల కాంగ్రెస్ నేతలతో సమావేశమై చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిపై విమర్శలు చేశారు. 4 దశాబ్దాలుగా కార్యకర్తలను తన వెంట తిప్పుకుని ఇప్పుడు మోసం చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నారని మండిపడ్డారు. అదే సమయంలో

2లో..

# టీడీపీ కమిటీలలో లోకేష్ మార్క్

- యువగళం టీమ్ కు పెద్ద పీట
- సీనియర్ల ఎంపికలో క్యాస్ట్ ఈక్వేషన్స్



అమరావతి (ప్రశ్న న్యూస్) టిడిపి నేతలు ఎప్పటి నుచో ఎదురుచూస్తున్న పార్టీ పదవుల ప్రకటన ఎట్టకేలకు వచ్చేసింది. నామినేటెడ్ పదవులు దక్కని వారికి చెప్పినట్టుగానే పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఈ ఎంపిక మొత్తంలో నారా లోకేష్ ముద్ర కొట్టొచ్చినట్టు కనపడింది. నెమ్మదిగా పార్టీని ఆయన టేక్ ఓవర్ చేస్తున్న సూచనలు బలంగా కనిపించాయి. 29 మందితో పొలిట్ బ్యూరో,31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ లు ఏర్పాటు చెయ్యగా నారా లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమోట్ అయ్యారు.


### -లోకేష్ గత పదవులు ఆయన సన్నిహితులకే

నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్

2లో..

# 3 రోజులు ఆరంజ్ అలెర్ట్

- పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- వడగాలులు వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఈసారి వేసవి కాలంలో భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. రోజురోజుకూ ఎండల తాకిడి పెరుగుతోంది. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రతకు జనం బయటికి రాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు బయట తిరగొద్దని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. సాధారణం కంటే అధికంగా ఎండలు ఉండటంతో జనం మధ్యాహ్నం పూటే బయటికి రావాలంటే భయపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు తెలంగాణ ప్రజలను మరింత భయాందోళనలకు గురి చేస్తున్నాయి. రాష్ట్రంలో రానున్న మూడ్రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు

2లో..

# ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్

## - స్వీడన్ పరిశోధనలో వెల్లడి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ప్రాణాంతక చర్మ క్యాన్సర్‌లలో ఒకటైన మెలనోమా ముప్పును ముందుగానే గుర్తించవచ్చని స్వీడన్‌లో జరిగిన ఒక కొత్త అధ్యయనం తేల్చింది. ఆరోగ్య వ్యవస్థల్లో

2లో..

# కాంగ్రెస్ నేతలకు పదవుల జాతర

బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమన్వయ లోపంపై చర్చించారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని, జిల్లాల వారీగా పార్టీ నేతలతో నిరంతరం టచ్‌లో ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడికి సీఎం సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో పార్టీ కేడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.

### గ్రేటర్ ఎన్నికలపైనా చర్చ

దీనితో పాటు, రాబోయే గ్రేటర్ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే దిశగా వ్యూహరచన చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును, లబ్ధిదారుల అభిప్రాయాలను పార్టీ యంత్రాంగం సేకరించాలని చర్చించారు. పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కేడర్ నుంచి అందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూసేందుకు క్రమం తప్పకుండా ఇటువంటి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో తీర్మానించారు.

### రెండు రోజుల్లో పదవుల జాబితా

రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ ముక్కోణపు భేటీ తెలంగాణ కాంగ్రెస్‌లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు, పార్టీలోని అంతర్గత విభేదాలకు చెక్ పెట్టి రాబోయే ఎన్నికలకు క్యాడర్‌ను సమరోత్సాహంతో సిద్ధం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే లిస్ట్ సిద్ధమైందని, ఏ క్షణమైనా అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు ధృవీకరిస్తున్నాయి.

# బీహార్‌లో కొత్త శకం

సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**- తలపాగా శపథం నెరవేర్చుకున్న సామ్రాట్**

1990లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన సామ్రాట్ చౌదరి, 1999లోనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 నుంచి బీజేపీలో కీలక నేతగా ఎదుగుతూ వచ్చారు. నితీశ్ కుమార్ బీజేపీతో తెగదెంపులు చేసుకుని మహాఘటబంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సామ్రాట్ చౌదరి ఒక శపథం చేశారు. నితీశ్‌ను సీఎం పదవి నుంచి దించేంత వరకు తన తలపాగా (మురైఠా) తీయనని ప్రతిజ్ఞ చేశారు. ఈ పంతం ఆయన రాజకీయ జీవితంలో ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడు సీఎంగా బాధ్యతలు చేపట్టి తన శపథాన్ని నెరవేర్చుకున్నారు.

**- అనుభవజ్ఞులైన డిప్యూటీ సీఎంలు**

నూతన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఇద్దరూ నితీశ్ కుమార్‌కు అత్యంత నమ్మకస్తులు, పరిపాలనలో అనుభవజ్ఞులు. విజయ్ కుమార్ చౌదరి గతంలో పలు కీలక శాఖలు నిర్వహించారు. ఇక, 79 ఏళ్ల విజేంద్ర ప్రసాద్ యాదవ్‌ను 'కోసీ ప్రాంత రాజకీయ చాణక్యుడు'గా పిలుస్తారు. 1990 నుంచి వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్న ఆయన, ముఖ్యంగా విద్యుత్ రంగంలో చేసిన అభివృద్ధితో ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. సామ్రాట్ చౌదరి నాయకత్వంలో ఈ అనుభవజ్ఞులైన నేతలతో కూడిన కొత్త ప్రభుత్వం, రాష్ట్ర అభివృద్ధిని కొనసాగిస్తూ ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# కేసీఆర్ మాస్ వార్నింగ్

దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాల గొంతు నొక్కేలా సీట్ల కేటాయింపు ఉంటే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**- గణాంకాలతో గెలుపు పిలుపు!**

ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు సుమారు 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఒకవేళ 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్లు పెంచితే, ఈ వాటా తగ్గిపోయి ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం పెరుగుతుందని కేసీఆర్ లెక్కలతో వివరించారు.

దక్షిణాది సీట్ల శాతం తగ్గకుండా, ప్రస్తుతం ఉన్న స్థానాలను కనీసం 50 శాతం పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే బీఆర్ఎస్ తన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని, అప్పటివరకు తొందరపడి ఎలాంటి మద్దతు తెలపవద్దని పార్టీ శ్రేణులకు ఆదేశాలిచ్చారు.

**- ఢిల్లీకి వినిపించేలా గళం!**

"మేమంతా గర్వించదగ్గ భారతీయులం దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు ప్రతినిధులం. మా ప్రజల గొంతును చట్టసభల్లో అణిచివేస్తుంటే చూస్తూ ఊరుకోం" అంటూ కేసీఆర్ అప్పట్లోనే కుండబద్ధలు కొట్టారు. ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరిగితే, ఇది కేవలం రాజకీయ పోరాటంగా మిగిలిపోదని ఇదొక భారీ ప్రజా ఉద్యమంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. "ఢిల్లీ పాలకులు వివేకంతో ఆలోచిస్తారని ఆశిస్తున్నాం" అంటూ ఆయన చేసిన ట్వీట్ అప్పట్లో జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. మొత్తానికి, మహిళా రిజర్వేషన్ల అమలును స్వాగతిస్తూనే దాని ముడిపడి ఉన్న డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికిని దెబ్బతీయకూడదన్నదే కేసీఆర్ ప్రధాన ఉద్దేశం.

# మీ సేవ సెంటర్లలో భారీగా అక్రమాలు

అధికారుల సోదాలు కొనసాగాయి. ప్రభుత్వం తరపు నుంచి పౌరులకు జారీ చేయాల్సిన ధృవపత్రాల విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఏసీబీ యాక్షన్‌లోకి దిగింది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారుల దాడుల సందర్భంగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణ ప్రజలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలను అందకుండా చేస్తున్నారని గుర్తించారు. దళారుల ద్వారా మీ సేవ నిర్వాహకులు, సిబ్బంది కలిసి చక్రం తిప్పుతున్నట్లు ప్రాథమికంగా తేలింది. కులం, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రాగా వాటిపైనా ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు.

ప్రజలు నేరుగా మీ సేవ కేంద్రాలకు వెళ్లి కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుంటే వాటిని వెంటనే జారీ చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు కొందరు బాధితులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అదే సమయంలో దళారుల ద్వారా అధిక ధరలు చెల్లించి చేసుకునే దరఖాస్తులను మాత్రం వెంటనే పరిష్కరిస్తున్నారని వాపోయారు. ఇక ఏసీబీ అధికారులు సోదాల సమయంలో మీ సేవ సెంటర్లలో ఉన్న నగదు నిల్వలు, పెండింగ్ దరఖాస్తుల లిస్ట్, మీ సేవ సిబ్బంది వ్యక్తిగత వివరాలను కూడా పూర్తిగా పరిశీలించాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి మీ సేవ నిర్వాహకులు, సిబ్బంది అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆధారాలు లభించినా ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే అధికంగా డబ్బులు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం

వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు.

రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# మేడ్చల్ నీటి సమస్య కొలిక్కి

**హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ అధికారుల పర్యటన**

**ఘనపూర్ నుండి మేడ్చల్ వరకు ఉన్న లోపాల పరిశీలన**

**మేడ్చల్ కు సరిపడ నీటిని సరఫర కు అధికారుల గ్రీన్ సిగ్నల్**

**హర్షం వ్యక్త చేసిన మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్**



మొదట మేడ్చల్ లో నెలకొన్న నీటి సమస్యను హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ కమీషనర్ అశోక్ రెడ్డి దృష్టికి, అక్కడినుండి అక్కడి నుండి సీఎంసి కమిషనర్ దృష్టికి, ఈడి దృష్టికి సిజెఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం తీవ్ర స్థాయిలో కృషి చేశారు. చివరకు ఈ అధికారులు మేడ్చల్ కు వచ్చి పరిస్థితిని సమీక్షించేలా వాయిస్ ఛైర్మన్ చీరల రమేష్ ప్రయత్నించారు. మేడ్చల్ కు సరిపడా మిషన్ భగీరథ మీరు సరఫరా అయ్యేలా కృషి చేశారు.

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ లో నెలకొన్న మంచినీటి సమస్య ఒక కొలిక్కి వస్తుంది. ఇటీవల హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ అధికారులు మేడ్చల్ లో పర్యటించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఘనపూర్ పంప్ హౌస్ నుండి మేడ్చల్ వరకు సమస్య ఎక్కడుంది అనే విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

### మేడ్చల్ జనాభాకు సరిపడా నీరు సరఫరాకు గ్రీన్ సిగ్నల్

మేడ్చల్ జనాభాకు సరిపడా మిషన్ భగీరథ నీటి సరఫరాకు హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం మేడ్చల్ జనాభా ప్రతిపాదికన 7.5 ఎం ఎల్ డి మిషన్ భగీరథ నీరు అవసరం కాగా గత ఆరు నెలల నుండి 1.5 నుంచి 3 ఎం ఎల్ డి నీరు సరఫరా కావడం వల్ల మేడ్చల్ పట్టణంలోని ఓవరేడ్ ట్యాంకులు నిండడానికి 5 నుంచి 6 రోజులు పట్టడం వల్ల మేడ్చల్ పట్టణవాసులు తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాలలో రోజుల తరబడి కుల్లాయి నుంచి నీరు రాకపోవడం వల్ల వేల రూపాయలు ఖర్చుపెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకొని వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.




### అధికారుల చుట్టూ తిరిగి సక్సెస్ అయిన చీర్ల రమేష్

మేడ్చల్ లో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ అధికారుల చుట్టూ తిరిగి నేటి సమస్య పరిష్కారాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చారు.

### భవిష్యత్తులో కూడా ప్రజల కోసం పనిచేస్తా

భవిష్యత్తులో కూడా ప్రజల కోసం పనిచేస్తానని మాజీ వైస్ చైర్మన్ చీరల రమేష్ తెలిపారు. మేడ్చల్ పట్టణానికి సరిపడా మిషన్ భగీరథ నీటి సరఫరాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చీర్ల రమేష్ తెలిపారు.

# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

బోటింగ్ సౌకర్యాలు కల్పించాలని, స్పోర్ట్స్ థీమ్స్ మరియు ఫారెస్ట్ అట్రాక్షన్లతో పర్యాటకులను ఆకట్టుకోవాలని ఆదేశించారు.రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును సిద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని స్పష్టం చేశారు.

**- నదుల అనుసంధానం - ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు**

ఉత్తరాంధ్ర ప్రాధాన్యతను వివరిస్తూ వంశధార–నాగావళి నదుల అనుసంధానాన్ని ఈ ఏడాది డిసెంబర్ నాటికి, నాగావళి–చంపావతి అనుసంధానాన్ని జూలై నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గడువు విధించారు. శ్రీకాకుళం జిల్లాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన నేరడి బ్యారేజీ పనులకు అడ్డంకులు తొలగిన నేపథ్యంలో, వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. తారకరామ, మహేంద్రతనయ, తోటపల్లి బ్యారేజీ వంటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**- పెరిగిన భూగర్భ జలాలు**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల భూగర్భ జలాల లభ్యత గణనీయంగా పెరిగిందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు 12 టీఎంసీలు పెరిగి, ప్రస్తుతం 625 టీఎంసీలకు చేరుకున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా సగటున 0.79 మీటర్ల మేర భూగర్భ జల మట్టం పెరిగింది.సుమారు 5,697 గ్రామాలలో కేవలం 8 మీటర్ల లోతులోనే నీరు అందుబాటులో ఉండటం శుభపరిణామమని సీఎం పేర్కొన్నారు.

**- రాయలసీమకు ఊరట**

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి మాల్యాల లిఫ్ట్ ద్వారా ఇప్పటికే 52 టీఎంసీల నీటిని రాయలసీమకు మళ్లించినట్లు అధికారులు నివేదించారు. హంద్రీ–నీవా, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికపుడిశెల వంటి ప్రాజెక్టుల పురోగతిని కూడా సీఎం ఈ సందర్భంగా సమీక్షించారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, జలవనరుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అటు పోలవరాన్ని పర్యాటక హబ్‌గా మార్చడం, ఇటు వెలిగొండ వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ జలవనరుల రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించబోతోందని ఈ సమావేశం ద్వారా స్పష్టమవుతోంది.

# కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమే

దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ. 26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని, వాటిని చంద్రబాబు తాత కూడా వారి నుంచి తీసుకోలేరని జగన్ స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది

జీవన్ రెడ్డికి తాము పార్టీలో ఎలాంటి లోటు చేయాలేదని స్పష్టం చేశారు. అయితే సీఎం వ్యాఖ్యలకు తాజాగా జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.జగిత్యాల జిల్లా రాయికల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జీవన్ రెడ్డి తన ఆవేదనను వెళ్లగక్కారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఒక ఉడుం లాగా చొచ్చుకొచ్చారని జీవన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి రావడంతోనే కాంగ్రెస్ పార్టీలో ఒక గీత గీసుకున్నారని పార్టీలో ఉన్న నేతలను ఎలా తొక్కాలి ఒక్కో మెట్టు ఎలా ఎక్కాలి అనేదే టార్గెట్‌గా పనిచేశారని మండిపడ్డారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న తనను నేరుగా బయటికి పొమ్మనలేక పొగబెట్టారని జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణను రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రాహుల్ గాంధీ నాయకత్వంపైనా జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా భారత్ జోడో పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కానీ ఈ 2 రాష్ట్రాలే రాహుల్ గాంధీని ప్రధానమంత్రి కాకుండా అడ్డుకున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించి ఉంటే నేడు భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ఉండే వారని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీలోని స్వార్థ రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలే ఈ పరిస్థితికి కారణమని జీవన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి కొంతమంది నాయకులు జంప్ చేస్తారని కానీ తాను మాత్రం ప్రజల క్షేమం కోసమే పార్టీ మారుతున్నట్లు జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు. తనను, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంటే తాను చూస్తూ ఊరుకోలేనని తేల్చి చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చిన్నాభిన్నం అయిపోయిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం కోసం పాకులాడే సంస్కృతి బాగా పెరిగిపోయిందని మండిపడ్డారు.మరోవైపు కేసీఆర్ ముందు తాను చేతులు కట్టుకుని నిలబడతానని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా జీవన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను కేసీఆర్ ముందు ఎందుకు నిలబడతానని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడడం సరికాదని విభేదాల పేరుతో వ్యక్తిగతంగా కించపరచడం ఏంటని మండిపడ్డారు. తాను ఎవరి ముందు చేతులు కట్టుకుని నిలబడనని కేసీఆర్, తాను సమకాలికులమని తామిద్దరం కలిసే రాజకీయ ప్రయాణం చేశామని గుర్తు చేశారు. తనకు ఆత్మగౌరవం ముఖ్యమని కాంగ్రెస్‌లో తన ఆత్మగౌరవం దెబ్బతింది కాబట్టే బయటికి వచ్చినట్లు జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# టీడీపీ కమిటీలలో లోకేష్ మార్క్

ప్రెసిడెంట్గా ప్రమోషన్ రావడంతో ఇప్పటి వరకూ ఆయన నిర్వహిస్తున్న పదవులు ఆయన సన్నిహితులకే దక్కాయి. జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని ముగ్గురికి పంచారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,ఎంపీ బైరెడ్డి శబరి, లోకేష్ కు అత్యంత సన్నిహితుడు కిలారు రాజేష్ లు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఎంపికయ్యారు.

**- సామాజిక వర్గీకరణ ఆధారంగా సీనియర్ లకు పోస్టులు**

ఈసారి టిడిపి పదవుల ఎంపికలో సీనియర్లకు సామాజిక వర్గం ఆధారంగా పోస్టులు దక్కాయి. పోలిట్ బ్యూరో సభ్యులు గా యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, వర్ల రామయ్య, నందమూరి బాలకృష్ణ వంటి వారి ఎంపిక లో ఇది కనపడింది.

**- సీనియర్ లకు జాతీయ పదవులు**

పార్టీలోని సీనియర్లకు జాతీయ పదవులు కేటాయించారు. అదే విధంగా ఇంతవరకు రాష్ట్ర అధికార ప్రతినిధులుగా పనిచేసిన వారికి జాతీయ అధికార ప్రతినిధులుగా ప్రమోషన్ ఇచ్చారు. ఈ కోటా లో పట్టాభి, సోమిరెడ్డి, దీపక్ రెడ్డి, నర్సిరెడ్డి లాంటి వారికి ప్రమోషన్ దక్కింది. పార్టీ జాతీయ కోశాధికారిగా కొనికళ్ళ నారాయణకు పదవినిచ్చి గౌరవించారు.

**- 'యువగళం' టీమ్ కు ప్రాధాన్యత**

లోకేష్ రాజకీయ చరిత్రలో గేమ్ చేంజర్ గా చెప్పుకునే "యువగళం ' యాత్ర లో కీలకం గా పనిచేసిన యంగ్ టీమ్ కు ఈసారి పార్టీ పదవుల్లో పెద్దపీట వేశారు. చాలామందికి రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. యువగళం టీమ్ లో కష్టపడిన చింతకాయల విజయ్, పాశం సునీల్ కుమార్ లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవులు దక్కాయి. అలాగే ఎమ్మెల్యేలలో చాలామందికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవులు ఇచ్చారు. వారితోపాటు కార్పొరేషన్లకు చైర్మన్ లుగా పనిచేస్తున్న వారికి కూడా ఉపాధ్యక్షులుగా రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. అలాగే పార్టీ విపక్షంలో ఉన్న టైంలో అండగా నిలబడిన వారికి స్థానికంగా ఉన్న నేతల వ్యతిరేకత ఉన్నప్పటికీ పదవులు కట్టబెట్టారు. అలాంటివారిలో కొవ్వూరు నియోజకవర్గం లో మాజీ మంత్రి కేఎస్ జవహర్ కుమారుడు ఆశీష్ లాల్ ఒకరు. తనకు రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కింది.

**- పూర్తిగా లోకేష్ టీమ్ తో నిండి పోయిన పార్టీ పదవులు**

ఈసారి పార్టీ పదవులు మొత్తం లోకేష్ టీం తో నిండిపోయిన చెప్పాలి. సీనియర్లను జాతీయస్థాయి కమిటీల్లో నియమించి గౌరవించినా గ్రౌండ్ లెవెల్ పెత్తనంతా లోకేష్ టీం కే దక్కింది. అలాగే యువకులకు ఈసారి పెద్దపీట వేయడం పార్టీలో మొదలైన నాయకత్వ మార్పుకు సంకేతంగా నిలిచింది. అలాగే కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడ్డ వారికి పార్టీ అండగా నిలబడింది అనే సంకేతాన్ని క్షేత్రస్థాయిలోకి ఈ కమిటీ ల ఎంపిక ద్వారా బలంగా పంపే ప్రయత్నం చేసింది టీడీపీ. మరి దీనిపై గ్రౌండ్ లెవెల్ పార్టీ కార్యకర్తలు ఎలా స్పందిస్తారో చూడాలి.

# ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్

ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని పరిశోధకులు బుధవారం వెల్లడించారు. ఈ అధ్యయనం కోసం స్వీడన్‌లోని దాదాపు 60 లక్షల మంది వయోజన జనాభాకు సంబంధించిన ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. వారి వయసు, లింగం, గత ఆరోగ్య సమస్యలు, వాడుతున్న మందులు, సామాజిక, ఆర్థిక స్థితి వంటి వివరాలను ఏఐ ద్వారా విశ్లేషించారు. ఐదేళ్ల అధ్యయన కాలంలో వీరిలో 38,582 మంది (0.64 శాతం) మెలనోమా బారిన పడినట్టు గుర్తించారు.

కేవలం వయసు, లింగం ఆధారంగా మెలనోమాను అంచనా వేసే పద్ధతితో పోలిస్తే, ఏఐ మోడల్ మెరుగైన ఫలితాలను ఇచ్చింది. సాధారణ పద్ధతిలో 64 శాతం కచ్చితత్వం ఉండగా, అధునాతన ఏఐ మోడల్ సుమారు 73 శాతం కేసుల్లో మెలనోమా వచ్చే వారిని, రాని వారిని వేరు చేయగలిగింది. అంతేకాకుండా, ఐదేళ్లలో మెలనోమా వచ్చే ప్రమాదం 33 శాతం వరకు ఉన్న హై-రిస్క్ గ్రూపులను కూడా ఈ ఏఐ మోడల్ గుర్తించడం విశేషం. గోథెన్‌బర్గ్ యూనివర్సిటీ పరిశోధకుడు మార్టిన్ గిల్‌స్టెడ్ మాట్లాడుతూ, "ఆరోగ్య వ్యవస్థల్లో ఉన్న డేటాతోనే మెలనోమా ముప్పు ఉన్నవారిని గుర్తించవచ్చని మా అధ్యయనం నిరూపించింది" అని తెలిపారు. దీనివల్ల హై-రిస్క్ గ్రూపులకు మాత్రమే సెలెక్టివ్ స్క్రీనింగ్ నిర్వహించి, వైద్య వనరులను మరింత సమర్థంగా వాడుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విధానాన్ని వైద్య రంగంలో ప్రవేశపెట్టే ముందు మరిన్ని పరిశోధనలు, విధానపరమైన నిర్ణయాలు అవసరమని వారు స్పష్టం చేశారు.

# 3 రోజులు ఆరంజ్ అలెర్ట్

వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అయితే వచ్చే 3 రోజులు ఉష్ణోగ్రతలు క్రమంగా 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ 3 రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

ఈ క్రమంలోనే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం, మెదక్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు వాతావరణ శాఖ రానున్న 3 రోజులకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ జిల్లాల్లో గరిష్ఠంగా 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఇక బుధవారం రోజున ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, నారాయణపేట, ఖమ్మం, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గురువారం రోజున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే వడగాల్పులు వీచే అవకాశం ఉన్న జిల్లాలకు ముందస్తుగా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రానున్న 3 రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం పూట అసలు బయటికి రావొద్దని హితవు పలికింది.

# వేసవిలో త్రాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రేపు జరుగు 21 మండల కేంద్రాలు,04 మున్సిపాల్టీలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ . అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. రేపు జరుగు మండల సభలకు ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకం,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సన్న వడ్ల బోనస్,ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు,ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, వినిపించాలన్నారు.రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్–అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టాలన్నారు.. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. అనంతరం వేసవికాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ క్షేత్రస్థాయిలో ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో తాగునీటి సమస్యకు నిర్మూలనకు కృషి చేయాలని, నీటి ఎద్దడి ముందుగా గుర్తించిన పక్షంలో ప్రత్యామ్నాయ చర్యల ద్వారా సమస్యను పరిష్కరించాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్నఎండలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలనివేసవిలో ప్రజలు ఎండలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మద్య ఎండ అధికంగా ఉంటుందని ప్రజలు బయటికి వెళ్లొద్దని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బబారిన పడే అవకశాలున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వడదెబ్బకు గురైతే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎండల్లో చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం చేయొద్దని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపితో కవరు చేసుకోవాలన్నారు. తరచుగా మంచినీళ్లు త్రాగాలని సూచించారు. మజ్జిగ, నిమ్మరసం, ఉప్పు పంచదార కలిపిన ద్రావణం, ఓఆరెస్ తీసుకోవాలని తెలిపారు. వదులుగా ఉన్న కాటన్ దుస్తువులు ధరించాలని తెలిపారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను



గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా షేడ్ నెట్స్, ఓఅర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఎండదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ గూగుల్ మీట్లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ఎస్ శివదయాల్, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస్, డీఎఫ్ఓ జో.జి , జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిపిఓ యాదయ్య, ఆర్ అండ్ బి ఈ.ఈ వేణు,ఆర్.డబ్ల్యూ.ఎస్ మిషన్ భగీరథ. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం

**- శ్రమదానంతో ఆదర్శంగా నిలిచిన ఎస్ఐ రమాకాంత్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా బోయినిపల్లి మండల కేంద్రంలోని ఆనంద్ విద్యానికేతన్ పాఠశాలలో ఎస్ఐ రమాకాంత్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులపై



ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ ఉపయోగించడం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నివారించాలన్నారు. హెల్మెట్ ధరించడం ప్రాణాలను కాపాడుతుందని, చిన్నారులు వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు.ఇక తల్లిదండ్రులు కూడా రహదారి భద్రత నియమాలను పాటించేలా విద్యార్థులతో ఉత్తరాలు రాయించి కుటుంబాల్లో చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు.అనంతరం ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శ్రమదానం చేపట్టి, బోయినిపల్లి––గంగాధర ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగించి, గుంతలను పూడ్చి రహదారిని సురక్షితంగా మార్చారు.ఈ సందర్భంగా ఎస్ఐ రమాకాంత్ మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు పాటించాలని, వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండి తనిఖీల సమయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగరాజు, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, కానిస్టేబుళ్లు కరీం, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

# లోయర్ మానేర్ డ్యామ్‌లో విషాదం

## - బాలుడు మునిగి మృతి



కొత్తపల్లి (ప్రశ్న న్యూస్) కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కొత్తపల్లి మండలం, చింతకుంట గ్రామ సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్ వద్ద ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం, ఈ ఘటన 14–04–2026 సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో జరిగింది. చింతకుంట గ్రామానికి చెందిన బింగి అర్షిత్ కుమార్ (15) డ్యామ్ వద్ద ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మునిగిపోయాడు.ఈ విషయంపై బాలుడి తండ్రి బింగి రాజేంద్ర ప్రసాద్ 15–04–2026 ఉదయం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నవ భారత నిర్మాణానికి యువత ముందుకు రావాలి

**- మై భారత్ వాలంటీర్ : గంగిపల్లి స్వామి కుమార్**

**- మై భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలం,అగ్రహారం జేఎన్‌టీయూ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మై భారత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలక్ట్రిషన్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మై భారత్ వాలంటీర్ గంగిపల్లి స్వామి కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశ రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా అట్టడుగు వర్గాల ఆశాకిరణంగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించి ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి అపూర్వమని అన్నారు. విజ్ఞానం, ధైర్యం, నిరంతర పోరాటంతో దేశ గమనాన్ని మార్చిన మహానుభావుడిగా అంబేద్కర్‌ను కొనియాడారు.అంబేద్కర్ ఆశయాలను గౌరవిస్తూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నవ భారత నిర్మాణంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.తదనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పుష్పలత, ప్రణీత, పూసల సంతోష్, నవదీప్, రజినీకాంత్, అజీజ్ తదితరులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడే వేడుకలను విజయవంతం చేయాలి

**- కార్మికుల హక్కుల కోసం ఉద్యమిద్దాం**

**- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి : గురిజాల శ్రీధర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, కొత్తపేట గ్రామంలో హమాలి కార్మికుల ఆధ్వర్యంలో మే 1న జరగనున్న 140వ ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తపేటలో బుధవారం కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ, కార్మిక వర్గం హక్కుల కోసం 140 ఏళ్ల క్రితం సాగిన పోరాటాల ఫలితంగా వచ్చిన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చుతూ కార్మికులకు అన్యాయం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని, మే 1న బోయినిపల్లి మండల కేంద్రంలో జరిగే జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలాగే వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు ఆర్థిక సహకారం అందించి, కార్యక్రమ విజయానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు సండే సారపు శ్రీనివాస్, బోనాల నాగరాజు, బోనాల ప్రశాంత్,కాశీరాం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు సెలవులు

## - భద్రతా పరికరాలు కల్పించాలి

**- కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలి**

**- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి**

**- ఏఐటీయుసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కదారి రాములు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా నాయకులు కదారి రాములు ఆధ్వర్యంలో విజ్ఞాపన పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి కదారి రాములు మాట్లాడుతూ 10వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.26,000 అమలు, కార్మికుల రెగ్యులరైజేషన్, పీఎఫ్ , హెల్త్ కార్డులు,డీఏ లు, ఈ ఎస్సై సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఈఎస్సై ఆసుపత్రి నిర్మాణం, కార్మికులకు యూనిఫామ్స్, భద్రతా పరికరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, వారానికి ఒక సెలవు, సంవత్సరానికి 15 సెలవులు,8 జాతీయ పండగ సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.కార్మికులు మరణించినప్పుడు రూ.20,000 అంత్యక్రియల ఖర్చు, ప్రమాద మరణాలకు ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కూడా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు,తో పాటుగా జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కుండ భానుచందర్ కు దళిత రత్న అవార్డు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్ కు దళిత రత్న అవార్డు దక్కింది.డాక్టర్ బాబాసాహెబ్ భీమ్ రావు అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న రవీంద్రభారతిలో కుండ భానుచందర్ కు దళితరత్న అవార్డ్ ప్రధానం చేశారు. కుండ బాలచందర్ చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డు ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కుండ భానుచందర్ మాట్లాడుతూ దళిత రత్న అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఇందుకు సహకరించిన పెద్దలకు, దళితరత్న అవార్డు రావడానికి నన్ను గుర్తించి నాకు సహరించిన పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కుండా భానుచందర్ పేర్కొన్నారు దళిత రత్న అవార్డు తీసుకున్న తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగిందని, దానికి అనుగుణంగా పని చేస్తానని తెలిపారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన సదస్సు



గజ్వేల్(ప్రశ్న న్యూస్) ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: గజ్వేల్ పోలీసులు గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలను 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణానికి సంబంధించిన కౌన్సిలర్లు ఆటో డ్రైవర్లు టాక్సీ డ్రైవర్లు అంబేద్కర్ వేడుకల సంఘ సభ్యులు గజ్వేల్ ట్రాఫిక్ సిఐ ఎం. మురళి, గజ్వేల్ టౌన్ సిఐ ఏ. రవికుమార్ హాజరై పట్టణ ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు.వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ ఎం. మురళి సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రాణాపాయాల గురించి వివరిస్తూ, అజాగ్రత్తగా వాహనాలు నడిపి అమూల్యమైన ప్రాణాలను బలి తీసుకోవద్దని గజ్వేల్ టౌన్ సిఐ ఏ. రవికుమార్ కోరారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు



గజ్వేల్( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అనుమతితో సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తన ప్రసంగంలో, భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అజరామరమని కొనియాడారు. ప్రజాస్వామ్యం సక్రమంగా నడవాలంటే రాజ్యాంగం అవసరమని గ్రహించి, రాజ్యాంగ రచన బాధ్యతలను స్వీకరించిన మహానుభావుడు అంబేద్కర్ గారేనని పేర్కొన్నారు.సుమారు 400 మంది విద్యార్థినుల సమక్షంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి కమలా క్రిస్టియాన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ శ్రీమతి ఎం.ఎం. లక్ష్మి, ఏసీఓ డాక్టర్ జె. ఉమారాణి, ఆర్ట్స్ విభాగం నుండి డాక్టర్ డి. సుజాత, శ్రీమతి బి. కస్తూరిబాయి, డాక్టర్ పి. జయరాజులు తదితరులు కూడా చిత్రపటానికి పూలతో అలంకరించి నివాళులు ఘటించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# మండల ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యం

**- నూతన తహసీల్దార్ : ఎండి షరీఫ్ మొయినోద్దిన్**

**- బోయినిపల్లి మండల నూతన తహసీల్దార్‌గా ఎండి షరీఫ్ మొయినోద్దిన్ బాధ్యతలు స్వీకరణ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల నూతన తహసీల్దార్‌గా ఎండి షరీఫ్ మొయినోద్దిన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎండి షరీఫ్ మొయినోద్దిన్ తెలిపారు. మండల పరిధిలో రెవెన్యూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# నూతన తహశీల్దార్‌కు ప్రజాప్రతినిధుల ఘన స్వాగతం - శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కార్యాలయంలో బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు కలిసి, ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం, మాజీ ఏఎంసి డైరెక్టర్ ఎమిరెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దార్‌కు హృదయపూర్వక స్వాగతం తెలుపుతూ, వారి పరిపాలనలో మండలం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# 16 ఏళ్ల ఉద్యమ సేవకు గౌరవం

**- కరుణాకర్ కు "దళిత రత్న" పురస్కారం ప్రధానం**

**- ఈ గౌరవం నాకెంతో ప్రేరణనిచ్చింది**

**- దళితరత్న పురస్కార అవార్డు గ్రహీత : అక్కెనపల్లి కరుణాకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా ఘనంగా నిర్వహించిన డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు 2026 సందర్భంగా మంగళవారం బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి కరుణాకర్‌కు ప్రతిష్టాత్మక "దళిత రత్న" అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ సేవలో విశేషంగా కృషి చేసిన వ్యక్తులను సత్కరించారు. గత 16 సంవత్సరాలుగా దళిత, బహుజన, తెలంగాణ ప్రజా ఉద్యమాల్లో తన వంతు పాత్ర పోషిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసినందుకు గాను కరుణాకర్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానం చేసి అవార్డును అందజేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం అక్కెనపల్లి కరుణాకర్ మాట్లాడుతూ... "ఈ గౌరవం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది. ఇది కేవలం నా వ్యక్తిగత పురస్కారం కాకుండా, నా వెంట నడిచిన సహచరులందరికీ చెందింది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నేను చేసిన కృషిని గుర్తించడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు నాకు మరింత బాధ్యతను గుర్తుచేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల కోసం మరింత శ్రమించడానికి ఉత్సాహాన్ని ఇస్తుంది" అని తెలిపారు.

# ములవాగు ఇసుక రీచ్‌పై ఆకస్మిక తనిఖీ... అక్రమ రవాణాపై కఠిన హెచ్చరిక



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ములవాగు ఇసుక రీచ్‌ను డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల నిర్వహణ, రవాణా అనుమతులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులు పరిశీలించి, సంబంధిత బాధ్యులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ విధానం ద్వారానే ఇసుక సరఫరా జరగాలని డీఎస్పీ స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడం, అనధికార నిల్వలు ఉంచడం వంటి చర్యలు సహించబోమని హెచ్చరిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఇసుక రవాణా ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు డీఎస్పీ ఆదేశించారు.

# మాదకద్రవ్యాల మృత్యుజాలం

# యువతను కాపాడాల్సిన సమయం ఇదే

## యువత భవిష్యత్తును మింగేస్తున్న అంధకారం



మన సమాజంలో నేడు ఒక ప్రమాదకరమైన అలవాటు నిశ్శబ్దంగా వ్యాపిస్తోంది, అదే మాదకద్రవ్యాల వ్యసనం. మొదట సరదాగా, "ఒక్కసారి ట్రై చేద్దాం" అనే ఆలోచనతో ప్రారంభమయ్యే ఈ అలవాటు, కొద్ది రోజుల్లోనే ఒక యువకుడి జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. మాదకద్రవ్యాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని కూడా క్రమంగా విధ్వంసం చేస్తాయి. గంజాయి, హెరాయిన్, కొకైన్, సింథటిక్ డ్రగ్స్, కోడైన్ సిరప్స్, ఇన్హెలెంట్స్ వంటి అనేక మాదక పదార్థాలు నేటి యువతను ఆకర్షిస్తున్నాయి. వీటిని మొదట వినోదం కోసం, ఒత్తిడి తగ్గించుకోవడానికి, లేదా స్నేహితుల ఒత్తిడితో వాడటం ప్రారంభిస్తారు. కానీ ఆ "ఒక్కసారి" అనేది చాలా సార్లు చివరి నిర్ణయంగా మారుతుంది. మెల్లగా ఈ పదార్థాలు మెదడుపై ప్రభావం చూపించి, మనిషి ఆలోచన, నిర్ణయశక్తి, భావోద్వేగాలను పూర్తిగా నియంత్రించడం మొదలుపెడతాయి. మాదకద్రవ్యాల ప్రభావంతో యువతలో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, నిరుత్సాహం, ఆత్మహత్య ఆలోచనలు, కోపం, అసహనం పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరపరంగా చూస్తే గుండె, కాలేయం, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. కొంత కాలం తర్వాత వారు సాధారణ జీవితం గడపలేని స్థితికి చేరుకుంటారు.

ఈ వ్యసనం కారణంగా కుటుంబాలు విరిగిపోతాయి. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పడిన కష్టాలు ఒక్క క్షణంలో వృథా అవుతాయి. కొందరు యువకులు డబ్బు కోసం దొంగతనాలు చేయడం, హింసాత్మక చర్యలకు పాల్పడటం, నేరాలలో చిక్కుకోవడం వంటి ప్రమాదకర దారుల్లోకి వెళ్లిపోతున్నారు. సమాజంలో నేరాల పెరుగుదలకు కూడా మాదకద్రవ్యాలే ఒక ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే మాదకద్రవ్యాల కోసం సాగుచేసే పంటలు, వాటిలో ఉపయోగించే రసాయనాలు ప్రకృతిని కూడా నాశనం చేస్తున్నాయి. అడవులు నరికివేత, నేల నాశనం, జీవ వైవిధ్యం తగ్గిపోవడం వంటి ప్రభావాలు దీని వల్ల వస్తున్నాయి. అంటే, ఈ సమస్య వ్యక్తిగతం మాత్రమే కాదు, ఇది సమాజం శ్రేయస్సును, ప్రకృతి, దేశ భవిష్యత్తుకు సంబంధించిన సమస్య.

### నివారణ, మార్పు, మన చేతుల్లోనే ఉంది

మాదకద్రవ్యాల సమస్యకు పరిష్కారం అసాధ్యం కాదు. కానీ అది ఒక వ్యక్తి ప్రయత్నంతో సాధ్యం కాదు. కుటుంబం, సమాజం, ప్రభుత్వ అధికారులు కలిసి పనిచేయాలి. మొదటగా, కుటుంబం ముఖ్య పాత్ర పోషించాలి. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడడం, వారి ఆలోచనలు తెలుసుకోవడం, వారి స్నేహితుల వాతావరణం గమనించడం చాలా అవసరం. ఒత్తిడి, ఒంటరితనం వంటి కారణాల వల్లే చాలా మంది యువకులు ఈ అలవాట్లకు బానిసలవుతున్నారు. కాబట్టి వారికి భావోద్వేగపూర్వక మద్దతు ఇవ్వాలి. స్కూల్లు, కాలేజీలలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. నిజ జీవిత ఉదాహరణలు, పునరావాసం పొందిన వ్యక్తుల కథలు విద్యార్థులకు చూపిస్తే, వారు ఈ ప్రమాదాన్ని సీరియస్‌గా తీసుకుంటారు. ప్రభుత్వం కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రగ్ సరఫరా నెట్‌వర్క్‌లను అరికట్టడం, కాలేజీల్లో తనిఖీలు పెంచడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. మీడియా కూడా ఈ అంశంపై బాధ్యతగా వ్యవహరించాలి.

వ్యసనానికి గురైన వారిని తిడటం, దూరం పెట్టడం పరిష్కారం కాదు. వారికి కౌన్సిలింగ్, వైద్య సహాయం, పునరావాసం అవసరం. ఆయుర్వేదం, యోగా, ధ్యానం వంటి సహజ విధానాలు కూడా శరీరాన్ని, మనసును శుద్ధి చేసి వారికి మళ్లీ కొత్త జీవితం ఇవ్వగలవు.

### ప్రతి యువకుడు తనకు తానే ఒక ప్రశ్న వేసుకోవాలి

ఈ అలవాటు నా భవిష్యత్తును నిర్మిస్తుందా.? లేక నాశనం చేస్తుందా.? అని. ఒకసారి ఆలోచిస్తే, సరైన నిర్ణయం తీసుకోవడం సులభం అవుతుంది. మాదకద్రవ్యాలు క్షణిక ఆనందాన్ని ఇస్తాయి, కానీ జీవితాంతం బాధను మిగులుస్తాయి. ఒక కుటుంబం నవ్వును కన్నీళ్లుగా మార్చే శక్తి వీటికి ఉంది. కాబట్టి ప్రతి యువకుడు ఒక నిర్ణయం తీసుకోవాలి నాకు వ్యసనం కాదు, మంచి జీవితం ఎంచుకుంటాను. మన సమాజం, మన కుటుంబాలు, మన భవిష్యత్తు కాపాడాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి.

ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం



వ్యవస్థాపక అధ్యక్షులు: సింహాచలం లక్ష్మణస్వామి, హైదరాబాద్

ఫోన్: 9908289830

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్యపరిచే ఉద్యమంలో భాగంగా ఈ వ్యాసపరంపరను అందిస్తున్నాము.

# దళిత రత్న అవార్డు గ్రహీత కరుణాకర్ కు గ్రామస్తుల ఘన సన్మానం - అభినందనలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామ వాస్తవ్యులు అక్కెనపల్లి కరుణాకర్ దళిత రత్న అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, మాజీ సర్పంచ్ బీరవెల్లి వెంకటేశ్వరరావు,మాజీ ఉపసర్పంచ్ బీరవెల్లి వెంకటేశ్వరరావు,చెన్నాడి శ్రీనాథ్ రావు,చెన్నాడి వెంకటేశ్వరరావు, ముచ్చ లింగారెడ్డి,అల్లూరి నరసింహారెడ్డి,అల్లూరి రవీందర్ రెడ్డి,రాచర్ల రాజేశం, వార్డు సభ్యులు అక్కెనపల్లి మధుకర్,చంద్రగిరి వెంకటేష్, ముత్యపు పరుశురాం,ఎర్రం రమేష్ రెడ్డి,కొట్టెపల్లి అనిల్, గంగాధర తిరుపతి,అక్కెనపల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతను శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళిత, సామాజిక ఉద్యమాలలో ఆయన చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. అనంతరం అవార్డు గ్రహీత మాట్లాడుతూ, తనను సన్మానించి అభినందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# మెదక్ నర్సింగ్ కళాశాలలో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ పట్టణంలో ఉన్నానర్సింగ్ కాలేజీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సింగ్ కళాశాలలో విద్యార్థినిలు తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. మౌళిక సౌకర్యాలు కల్పించాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం, కళాశాల ప్రిన్సిపాల్ పట్టించుకోవడంలేదు .సమస్యలు పరిష్కారం చేయాలని అడితే ఉంటే ఉండండి వెళ్తే వెళ్ళండి అంటూ విద్యార్థినిలను బెదిరించడని తీవ్రంగా ఖండిస్తున్నాం. జిల్లా కేంద్రంలో ఉన్న నర్సింగ్ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్న ,విద్యార్థులకు సరైన సదుపాయాలు లేకపోయినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. నర్సింగ్ విద్యార్థినిలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సి ఉంటే మెనూ అమలు కావడం లేదు. 120 మంది విద్యార్థులకు ఒక్కే టాయిలెట్ ఉండడం వలన సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నారు. మంచినీటి సౌకర్యం, సరిపోను రూమ్స్, డైనింగ్ హాల్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. నర్సింగ్ కళాశాల విద్యార్థుల కోసం స్వంత హాస్టల్ భవనం నిర్మించాలి. నర్సింగ్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రిన్సిపాల్పై చర్యలు తీసుకోవాలని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అధికారులతో విచారణ జరిపించాలని, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని సిపిఎం మెదక్ జిల్లా కమిటీ కోరుతుంది.

# ఘనంగా అంగన్వాడి కేంద్రంలో దన్విత్ గౌడ్ జన్మదిన వేడుకలు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో బుధవారం నాడు అంగన్వాడి కేంద్రంలో నాగుల గారి దన్విత్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు తదుపరి శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ శర్మ ఆశీస్సులు తీసుకోవడం జరిగింది ఈ సందర్భంగా అంగన్వాడి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి అంగన్వాడి విద్యార్థులకు జన్మదిన సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే మెటీరియల్ ను అందజేసి నాగుల గారి దన్విత్ గౌడ్ తల్లిదండ్రులు నాగలగారి నాగరాజు గౌడ్ సౌజన్య అంగన్వాడి టీచర్ శోభ అంగన్వాడి ఆయమ్మ చంద్రకళ చేతుల మీదుగా విద్యార్థులకు ఉపయోగపడే మెటీరియల్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

# వార్డు సభ్యులకు గౌరవ వేతనం కల్పించాలి

**- రాష్ట్ర అధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)వార్డు సభ్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి గౌరవ వేతనం అందించాలని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ అన్నారు. ఉత్తర తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం కరీంనగర్‌లోని ప్రైవేట్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు కరుణాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సేవలు చేస్తున్న వార్డు సభ్యులకు కనీసం రూ. 3000 గౌరవ భృతి, రూ. 25 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న వేతనాలను తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కరుణాకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీదేవి అనిల్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తీగుట్ల నవీన్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నరేష్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు నరసయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ నాగుల సాంబయ్య గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి డి. శ్రీకాంత్, రాష్ట్ర ముఖ్య సలహాదారు గడప కోటేష్ కుమార్, రాష్ట్ర సలహాదారు ఈర్ల రామచందర్ పాల్గొన్నారు. అలాగే గంగాధర వెంకటరమణ – జమున, తిరుమల, శ్రీకాంత్ గౌడ్, ఎదురుగట్ల అజయ్, దూస రాజశేఖర్, గుండె కార్ల శ్రీనివాస్, వంశీ, గణేష్ తదితరులు హాజరయ్యారు.

## నెరవేరబోతున్న పేదల సొంతింటి కల లబ్ధిదారులతో బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా టిడ్కో ఇళ్ల



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా 1648 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలను స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అందించారు. దీంతో లబ్ధిదారులు వారి వారి గృహాల్లో పాలు పొంగించి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించుకున్నారు. టిడ్కో ఇళ్ల గృహ సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కోలా ఆనంద్ కుమార్ జనసేన కూటమి నాయకులు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పేదలు గృహప్రవేశాలు చేసేలా కార్యక్రమం చేపట్టారు. ప్రైవేట్ ఆపార్ట్‌మెంట్లకు ధీటుగా పార్కులు, వాకింగ్ ట్రాక్ వంటి మౌలిక సదుపాయాలతో టిడ్కో గృహప్రవేశం వంటి సముదాయాలను నిర్మించినాము. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి. మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల పేదల కలల సౌధం సాక్షాత్కరించింది. గత ఎనిమిదేళ్లుగా కళు కాయలు కాసేలా వేచి చూస్తున్న నిరీక్షణకు తెరపడింది. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, తిరుపతి పార్లమెంట్ కోశాధికారి కంట రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, టిడిపి నాయకులు కాసారం రమేష్, పేట బాలాజీ రెడ్డి, మునిరాజు నాయుడు, సుమతి, రేణుకమ్మ, కుమారి, సుప్రజ, ముని రాజా, మునిరాజా యాదవ్, ఢిల్లీ, షకీరాలి, లోకేష్, మిర్జావలి, కూటమి నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టెన్త్ మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ పరిధిలో గల ఎన్ ఎస్ కే కే పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పాల్గొన్నారు. తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ మూల్యాంకన ప్రక్రియ జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, సమాధాన పత్రాల దిద్దుబాటులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలర్లు వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి, ఫలితాల విడుదలకు సహకరించాలని కోరారు. వాల్యుయేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని, అనధికార వ్యక్తులు లోపలికి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో స్పాట్ క్యాంప్ ఆఫీసర్లు, సహాయక సిబ్బంది, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ పై
# మల్లారెడ్డి కాలేజీలో ధూంధాం

**- ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలి అంటూ ఏబీవీపీ డిమాండ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) ఫ్లీజ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా మైసమ్మగూడ శాఖ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గేట్ మీటింగ్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ నేత జీవన్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 2 వేల ఇన్స్టిట్యూషన్లలో గేట్ మీటింగ్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు నాలుగు సంవత్సరాల నుండి పదివేల కోట్ల స్కాలర్షిప్ల ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాక దాదాపుగా 22 లక్షల నుండి 25 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆరోపించారు. కొన్ని ప్రైవేట్ ఇన్స్టిట్యూషన్స్ నాలుగు సంవత్సరాలు నుంచి స్కాలర్షిప్స్,ఫీజు రియంబర్స్మెంట్ పై కోర్టుకు వెళితే కోర్టు ప్రభుత్వాన్ని సమాధానం అడిగితే సమాధానం ఇవ్వకపోవడం వలన వచ్చే సంవత్సరం నుండి 2026 -27 అకాడమిక్ ఇయర్లో విద్యార్థుల నుండే ఫీజులు వసూలు చేసుకోండి అని చెప్పడం చూస్తే ప్రభుత్వం మీద మొట్టికాయలు వేసినట్టే అని ఏబీవీపీ భావిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర మాని స్కాలర్షిప్స్ , ఫీజు రియంబర్స్మెంట్ తో పాటు నాణ్యమైన విద్య అందించకపోతే ప్రభుత్వం కుప్పకూలే వరకు పీఠాలు కదిలేటట్టు, ఏ ప్రజా ప్రతినిధిని కూడా రోడ్లమీద తిరుగనీయకుండా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి విభాగ్ కన్వీనర్ నాగేష్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృత్యుంజయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆశిష్ మైసమ్మగూడ నగర కార్యదర్శి శివ సంయుక్త కార్యదర్శి సన్నీ, రోహిత్, కార్యకర్తలు అశ్వంత్ మనీ తదితరులు పాల్గొన్నారు.

## అపరిష్కృత సమస్యల కోసం పోరాటాల బాట

**( తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం)**



హిమాయత్ నగర్ (ప్రశ్న న్యూస్) ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వ మొండివైఖరి తీవ్ర ఆక్షేపణీయమని ఏఐటియూసీ అనుబంధం సంస్థ అయిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీవ్రంగా దుయ్యబట్టింది. హిమాయత్ నగర్ లోని కామ్రేడ్



సత్యనారాయణరెడ్డి భవన్ లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో కమిటీలు ఏర్పాటు చేసి కాలయాపన చేయడం తప్ప ఒరగబెట్టిదేమి లేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక అంశాలపై ముక్తకంఠంతో తీర్మానం చేశారు. ముఖ్యంగా రెండవ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి మూడేళ్లు కావస్తున్నా నివేదిక అతీగతీ లేదని, వెంటనే పీఆర్సీ కమిటీ నివేదికను ప్రవేశపెట్టి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిలు తక్షణం చెల్లించాలని, వైద్య శాఖలో గుర్తింపు పొందిన యూనియన్ నాయకుల అక్రమ బదిలీలు రద్దు చేసి, వారి హక్కులు కాపాడాలని, వైద్య విధాన పరిషత్ లో మినిమం టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులు రెగ్యులర్ చేస్తు, ఈ.ఎస్.ఐ. ఉద్యోగులకు 126 జి ఓ ను సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధనలో భాగంగా ఈ నెల 17 వ తేదీ (శుక్రవారం) నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఉదయం హాజరు సమయంలో నిరసన ప్రదర్శనలు జరుపాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నోటీసు అందజేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యం. శ్రీనివాసమూర్తి (ఎంఎస్ మూర్తి) రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు వేణుకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాష్ట్ర కోశాధికారి సుశీల, గ్రేటర్ హైదరాబాద్ బ్రాంచ్ కార్యదర్శి జగన్ మోహన్ రావు, తదితరులు పాల్గోన్నారు .

## తొగుటలో కేజీబీవీ పాఠశాలలో
# రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం




**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** అర్రివ్ అలీవ్ 4వ దశ కార్యక్రమంలో భాగంగా తొగుటలోని కేజీబీవీ పాఠశాలలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తొగుట సి.ఐ ఎస్.కె. లతీఫ్, ఎస్.ఐ వి. రవికాంత్ రావు పోలీస్ సిబ్బందితో కలిసి విద్యార్థులతో ముచ్చటించి, రోడ్డు భద్రతపై కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం లెటర్ రైటింగ్ పోటీ నిర్వహించి, రోడ్ సేఫ్టీపై అవగాహన పెంపొందించారు. అధికారులు మాట్లాడుతూ పిల్లలు మైనర్ డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే రోడ్డును దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్ వద్దనే దాటాలని తెలిపారు. అనంతరం తొగుట ఎక్స్ రోడ్ వద్ద విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది కలిసి హ్యూమన్ చైన్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులను అభినందిస్తూ గులాబీ పూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



**గజ్వేల్(ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ వైద్యులు బుధవారం ఒక అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన సాయిరాం పూజ (29) అనే గర్భిణీకి సురక్షితంగా ప్రసవం చేసి పండంటి ఆడ శిశువు (3.75 కిలోలు) జన్మనిచ్చారు. భారీ ఊబకాయం (139 కిలోలు) మరియు థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న ఈ గర్భిణీకి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు రూ.2 లక్షల ఖర్చు అవుతుందని తెలపడంతో, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ప్రత్యేక చొరవ తీసుకుని వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊబకాయం (ఓబేసిటీ) ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య అని, దీని వల్ల భవిష్యత్తులో రక్తపోటు, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. అలాగే థైరాయిడ్ సమస్యల వల్ల అధిక బరువు, అలసట, చలి తట్టుకోలేకపోవడం, జుట్టు రాలడం, మలబద్ధకం, మానసిక ఒత్తిడి వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్న మహిళలు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందంలో డాక్టర్ అన్నపూర్ణతో పాటు డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సుశీల, డాక్టర్ సతీష్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ మైహిపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, సిబ్బంది ఆంజనేయులు, శ్రీలత, ఓటీ టెక్నీషియన్ రవీందర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వైద్య బృందాన్ని అభినందించారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పేషెంట్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తాము పేదవారమని, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునే స్థోమత లేక మానసికంగా కుంగిపోయిన సమయంలో గజ్వేల్ ఆసుపత్రి వైద్యులు ఆదుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తల్లి, బిడ్డ సురక్షితంగా ఉండటంతో ఆనందం వ్యక్తం చేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి


**- గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ వారి ఆధ్వర్యంలో గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండి కరీం ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు పి ఆంజనేయులు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభ కార్యక్రమానికి గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి చేతుల మీదుగా ప్రారంభిచారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత నుండి ఉపశమానం కలిగించడానికి బాటసారుల దాహర్తిని తీర్చడానికి దాతలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఉచిత మంచినీటి కేంద్రమే చలివేంద్రం. చలివేంద్రం సాధారణంగా మట్టి కుండలాల్లోని చల్లని నీరు లేదా మజ్జిగను అందస్తారు. ఇవి రద్దీ ప్రదేశాలలో బస్టాండ్ కూడళ్ళల్లో వీటిని ఏర్పాటు చేసి ప్రజల దాహర్తి తీర్చడంలో పుణ్యం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో గౌరవ అధ్యక్షులు ఎస్.కె ఫరీద్ ( ఖలీద్ ) ఆర్గనైజేషన్ సెక్రటరీ బిఖానా మాజీ ఆటో యూనియన్ అధ్యక్షులు కుమార్ యూసుఫ్ ఖాన్ ఆటో యూనియన్ సభ్యులు నరేందర్ వాజిద్ రాజు జీవన్ గజ్వేల్ ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కపిలేశ్వరుని దర్శనం, జీవితానికి పరమానందం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు





తిరుపతి ( ప్రశ్న న్యూస్) సప్తగిరుల్లో వెలసిన పవిత్ర క్షేత్రమైన శ్రీ కామాక్షి సమేత శ్రీ కపిలేశ్వరస్వామి దేవాలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు బుధవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, సప్తగిరులలో అత్యంత పుణ్యప్రదమైన కపిలతీర్థంలో స్నానం చేయడం వల్ల దేవతలతో పాటు పితృదేవతలు సంతోషిస్తారని పురాణాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. భక్తులు ముందుగా విఘ్నేశ్వరుని దర్శించుకుని, అనంతరం కామాక్షి సమేత కపిలేశ్వరస్వామిని దర్శించుకోవడం ద్వారా సంతానం, శ్రేయస్సు, కుటుంబ సుఖసంతోషాలు కలుగుతాయని వివరించారు. అలాగే కాలభైరవ స్వామి, కోటిలింగాలు, బిల్వ వృక్షం దర్శనం చేసి బయలుదేరితే మరింత శుభఫలితాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ కె.పి. చంద్రశేఖర్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తురకపల్లిలో ఘనంగా పోషన్ పక్వాడ

**- గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన.**




**కనిగిరి:** కనిగిరి మండలంలోని చాకిరాల పంచాయతీ తురకపల్లి గ్రామంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గ్రామస్థుల్లో మంచి స్పందనను రేకెత్తించింది. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల బాలింతలకు, పుట్టిన శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శిశువుల శారీరక, మానసిక అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు దీపిక, జరీనా, జులేఖలు పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు వివిధ సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో సహాయ ఇంజనీర్

**కరీంనగర్** హుజూరాబాద్ మునిసిపల్ శాఖలో సహాయ ఇంజనీర్ గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయాడు. మునిసిపల్ పరిధిలో చేసిన పనులకు గాను బిల్లు మంజూరు చేయడానికి బాధితుడినుంచి సుధాకర్ రెడ్డి యాభై వేల రూపాయలను లంచం అడిగాడు. దాంతో బాధితుడు ఏసీబీకి పిర్యాదు చేసాడు. అధికారుల సూచన మేరకు బాధితుడు బుధవారం నాడు ఆర్టీసీ డిపో చౌరస్తా దగ్గర లంచం సుధాకర్ రెడ్డికి ఇస్తున్నప్పుడు అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

# రామ్ చరణ్ 'పెద్ది' జూన్‌కు వాయిదా..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది.సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు.

సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.

# రూ. 3000 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్' ఫ్రాంచైజీ..

## బాహుబలి, పుష్పలను వెనక్కి నెట్టి చారిత్రక రికార్డ్!



బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ భారత సినీ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. రెండు భాగాలుగా వచ్చిన ఈ సిరీస్, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి భారతీయ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో రాజమౌళి రూపొందించిన 'బాహుబలి', ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' ఫ్రాంచైజీలను అధిగమించడం విశేషం. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం 'ధురంధర్' మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1,307.35 కోట్లు వసూలు చేయగా, ఇటీవలే విడుదలై నెల రోజులు పూర్తి చేసుకోబోతున్న 'ధురంధర్: ది రివెంజ్' ఇప్పటివరకు రూ. 1,712 కోట్లకు పైగా రాబట్టింది. దీంతో రెండు చిత్రాల మొత్తం వసూళ్లు రూ. 3,019.35 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో 'బాహుబలి' ఫ్రాంచైజీ రూ. 2,438 కోట్లు, 'పుష్ప' ఫ్రాంచైజీ రూ. 2,092.20 కోట్ల వసూళ్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'ధురంధర్: ది రివెంజ్' చిత్రం ఒక్కటే 27 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 1,727.93 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో భారతదేశంలో గ్రాస్ వసూళ్లు రూ. 1,311.68 కోట్లు కాగా, ఓవర్సీస్‌లో రూ. 416.25 కోట్లు ఉన్నాయి. ఈ చిత్రం విడుదలైన తొలి 11 రోజుల్లోనే మొదటి భాగం లైఫ్‌టైమ్ కలెక్షన్లను అధిగమించి సత్తా చాటింది. ఈ ఘనతపై ప్రముఖ ట్రేడ్ విశ్లేషణ సంస్థ శాక్‌నిల్క్ నివేదిక స్పందిస్తూ... "ఈ రూ. 3000 కోట్ల మైలురాయి కేవలం ఒక సంఖ్య కాదు. భారతీయ ఫ్రాంచైజీలను ప్రపంచ వేదికపై చూసే దృష్టికోణంలో వచ్చిన మార్పుకు ఇది సంకేతం. ఇప్పటివరకు భారతీయ సినిమా ఎన్నో బ్లాక్‌బస్టర్లను అందించింది. కానీ, ప్రపంచంలోని అతిపెద్ద ఫిల్మ్ సిరీస్‌లతో పోటీపడగల సత్తా మన కథలకు ఉందని ధురంధర్ నిరూపించింది" అని పేర్కొంది. గల్ఫ్ దేశాలు, చైనాలో విడుదల కాకుండానే ఈ స్థాయి వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా కూడా 'ధురంధర్ 2' నిలిచింది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.

# 'అనకొండ' మూవీ రివ్యూ!



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాలీవుడ్ సినిమాలలో 'అనకొండ' ఒకటిగా కనిపిస్తుంది. అప్పటివరకూ అమెజాన్ ఫారెస్టులో ఉండే 'అనకొండ' అనే పాముల గురించి తెలిసినవాళ్లు చాలా తక్కువనే చెప్పాలి. అందువలన అందరూ ఈ సినిమాను చూస్తూ థ్రిల్ ను ఫీలయ్యారు. దట్టమైన దండకారణ్యంలో అనకొండలు చేసే దాడులను తెరపై చూసిన ప్రేక్షకులు, చాలా కాలం పాటు మరిచిపోలేకపోయారు. ఆ తరువాత 'అనకొండ' నేపథ్యంలో అనేక సినిమాలు వచ్చాయి. అలా క్రితం ఏడాది డిసెంబర్ లో థియేటర్లలో అడుగుపెట్టిన ఈ సినిమా, 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.డగ్ (జాక్ బ్లాక్) వివాహ వేడుకలకు సంబంధించిన వీడియోలు చేస్తూ ఉంటాడు. భార్య మాలీ .. కొడుకు ఛార్లీతో అతని లైఫ్ హ్యాపీగా సాగిపోతూ ఉంటుంది. అలాంటి పరిస్థితులలోనే చిన్ననాటి స్నేహితులైన గ్రిఫ్ (పాల్ రడ్) కెన్నీ (స్టీవ్ జాన్) క్లైర్ (తాండివే న్యూటన్) కలుస్తారు. మాటల సందర్భంలో 'అనకొండ' సినిమాను గురించిన ప్రస్తావన వస్తుంది. అలాగే చిన్నతనంలోనే నటన .. డైరెక్షన్ పట్ల తాము చూపిన ఉత్సాహాన్ని వాళ్లు గుర్తుచేసుకుంటారు.'అనకొండ' సినిమాను తాము రీ బూట్ చేస్తే బాగుంటుందని భావిస్తారు. అమెజాన్ ఫారెస్టుకి వెళ్లి షూటింగు చేసుకుని వద్దామని 'గ్రిఫ్'తన మనసులోని మాటను చెబుతాడు. అమెజాన్ ఫారెస్టు నేపథ్యంలో కథను తయారు చేసే బాధ్యతను ఒకరు .. నిర్మాణానికి అవసరమైన ఖర్చును భరించేది ఒకరు .. దర్శకత్వం చేసేది ఒకరు అంటూ, ఎవరెవరు ఏ పని చేయాలనే విషయంలో పూర్తి క్లారిటీకి వస్తారు. సినిమాకి అవసరమైన అనకొండ పాము కోసం, కార్లోస్ ను సంప్రదిస్తారు. అదే వృత్తిగా జీవిస్తున్న కార్లోస్ ఒక చిన్నపాటి అనకొండతో బయల్దేరడానికి తాను సిద్ధమని చెబుతాడు. మూడు వారాలలో షూటింగును పూర్తిచేసుకుని రావాలనే ఉద్దేశంతో అంతా కలిసి అమెజాన్ ఫారెస్టుకి బయల్దేరతారు. అయితే బోట్ నడిపే యువతిగా వారికి 'అనా' పరిచయమవుతుంది. వాళ్లతో కలిసి ఆమె కూడా ముందుకు సాగుతుంది.అమెజాన్ ఫారెస్టు ప్రాంతంలో అక్కడ లభించే బంగారం విషయంలో రెండు గ్యాంగ్ ల మధ్య వార్ జరుగుతూ ఉంటుంది. అందులో ఒక ముఠాకి చెందిన యువతియే 'అనా'. డగ్ బృందంతో కలిసి ముందుకు వెళుతున్న ఆమె కోసం శత్రువులు గాలిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే షూటింగు కోసం తీసుకెళ్లిన 'అనకొండ' పాము ప్రమాదవశాత్తు చనిపోతుంది. దాంతో అడవిలోని అనకొండనే తీసుకొస్తానని కార్లోస్ వెళతాడు. అప్పుడు ఏం జరుగుతుంది? నిజమైన అనకొండ కారణంగా వాళ్లకి ఎలాంటి పరిస్థితి ఎదురవుతుంది? అనేది కథ. మొదటి సారిగా వచ్చిన 'అనకొండ' ఆడియన్స్ ను ఒక రేంజ్ లో థ్రిల్ చేసింది. ఆ తరువాత అదే తరహా కంటెంట్ తో చాలా సినిమాలు వచ్చినప్పటికీ, ఆ స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయాయి. ఆ నేపథ్యంలో వచ్చిన సినిమానే ఇది. చిత్రంలోని ప్రధానమైన తారాగణం అమెజాన్ అడవులకు వెళ్లడం .. అక్కడ అనకొండల కారణంగా వాళ్లకి ఎదురయ్యే అనుభవాలతో ఈ కథ నడుస్తుందనే విషయం ప్రేక్షకులకు ముందుగానే అర్థమైపోతుంది. అనకొండ సినిమా మొదలైన దగ్గర నుంచి, ఫారెస్టుకి ఈ బృందం ఎప్పుడు చేరుకుంటుందా అనే కుతూహలంతోనే ఆడియన్స్ వెయిట్ చేయడం మొదలుపెడతారు. అనకొండపై సినిమా తీయడానికి మిత్ర బృందం అమెజాన్ అడవులకి బయల్దేరడంతో అసలు కథ మొదలవుతుంది.ఇక ఆ అడవిలో బంగారం కోసం అన్వేషించే ముఠాలు, వారి మధ్య సాగే పోరాటం ఈ కథకి సమాంతరంగా నడుస్తూ ఉంటుంది. అమెజాన్ అడవులకు షూటింగు కోసం తెచ్చిన చిన్నపాటి అనకొండ స్థానంలోకి, నిజమైన భారీ అనకొండ వచ్చి చేరడంతో కథ కీలకమైన దశకి చేరుకుంటుంది. ఇక అక్కడి నుంచి ప్రేక్షకులు ఎదురుచూసే దిశగా ఈ కథ కదులుతుంది. కానీ వాళ్లు ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లలేకపోయింది. ఏ స్థాయిలోను ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఉత్కంఠను రేకెత్తించే సన్నివేశాలు ఎక్కడా కనిపించవు.

అనకొండ వెంటాడే దృశ్యాలు కూడా అంతగా ఇంపాక్ట్ చూపలేకపోయాయి. అసలు కథను మొదలు పెట్టడానికే అరగంట సమయం తీసుకున్నారు. ఈ అరగంటలో జరిగే కథ కూడా అనవసరమైన సంభాషణలతో .. అర్థం లేని కామెడీతో నడుస్తుంది. అనకొండకంటే ఎక్కువగా ప్రేక్షకులను భయపెట్టేది ఈ కామెడీనే. ఇక అమెజాన్ అడవులకు చేరుకున్న తరువాతనైనా కథ కాస్త గాడిలో పడుతుందేమోనని అనుకుంటే, స్క్రిప్ట్ అనేది లేకుండా అక్కడికక్కడ .. అప్పటికప్పుడు అనుకుని షూట్ చేశారేమో అనిపించకమానదు. కథ .. కథనం .. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. గ్రాఫిక్స్ .. ఇలా వీటిని గురించి మాట్లాడుకోవడానికి పెద్దగా ఏమీ లేదు. తెరపై పాత్రలు చేసే హడావిడీ తప్ప మరేమీ లేదు. కథ లేకపోవడం వల్లనే కాలక్షేపం చేస్తున్నారనే విషయం ప్రేక్షకులకు అర్థమైపోతూనే ఉంటుంది. ఏ మాత్రం కథపై దృష్టి పెట్టని కంటెంట్ గా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పొచ్చు. ఇకపై తెరపై అనకొండను చూస్తే కాదు, ఈ పేరు వింటేనే భయపడేలా చేశారని చెప్పాలి.

# కీసర సర్కిల్‌లో భారీ అక్రమ షెడ్ నిర్మాణం

**- అధికారుల నిజాయితీకె సవాల్ విసిరిన నిర్మాణదారుడు - మామూళ్లు ఇచ్చానంటూ బహిరంగ ప్రచారం**

**- దమ్మెగూడ--నాగారం రోడ్డుపై కొనసాగుతున్న షెడ్ నిర్మాణం**




**కీసర (ప్రశ్న న్యూస్)** కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలకు బలం చేకూర్చే ఘటన వెలుగులోకి వచ్చింది. దమ్మెగూడ,నాగారం ప్రధాన రహదారి పక్కనే భారీ పరిమాణంలో అక్రమ షెడ్ నిర్మాణం వేగంగా కొనసాగుతుండటం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన కీసర సర్కిల్ కార్యాలయం పరిధిలోనే ఈ నిర్మాణం జరుగుతుండటం అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది.స్థానికుల వివరాల ప్రకారం, నిర్మాణదారుడు ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున షెడ్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిర్మాణ పరిమాణం, వినియోగ లక్ష్యాలు చూస్తే ఇది సాధారణ నిర్మాణం కాదని, భారీ స్థాయిలో కమర్షియల్ ప్రయోజనాల కోసం నిర్మాణం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.ఇక మరింత సంచలనం రేపుతున్న అంశం ఏమిటంటే ఈ నిర్మాణంపై ఫిర్యాదు చేసిన స్థానికులకే నిర్మాణదారుడు సవాల్ విసిరినట్లు సమాచారం. "అధికారులకు మామూలు ఇచ్చాను, మీరేం చేయలేరు" అంటూ అతను బహిరంగంగా వ్యాఖ్యానించడం స్థానికులలో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ఈ వ్యాఖ్యలు నిజమైతే, మున్సిపల్ వ్యవస్థలో అవినీతి స్థాయి ఎంత లోతుగా ఉందో అర్థమవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. మరోవైపు ప్రధాన రహదారి పక్కనే ఇలాంటి భారీ నిర్మాణం జరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, భవిష్యత్తులో భద్రతా సమస్యలు తలెత్తే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు



పెరిగితే పట్టణ ప్రణాళికకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ భారీ అక్రమ షెడ్ నిర్మాణంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, అక్రమ షెడ్ నిర్మాణాన్ని కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సహకరిస్తున్న సిబ్బంది, అధికారులపై విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే, కీసర సర్కిల్ పరిధి అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమాలకు చెక్ పెట్టాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వీడకపోతే, మున్సిపల్ శాఖ పై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతింటుందని స్పష్టం అవుతోంది.

# నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా టీడీపీ పార్టీకి నూతన ఉత్సాహం

**- నారా లోకేష్ టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంపిక సందర్భంగా సంబరాలు చేసుకున్న టీడీపీ నేతలు**



మంగళగిరి(ప్రశ్న న్యూస్ )టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ ఎంపిక అయిన సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. నేతలు కేక్ కట్ చేసి, ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ, నారా లోకేష్ ని టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఇది పార్టీకి కొత్త శక్తిని ఇస్తుంది అని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ బాబు మాట్లాడుతూ, లోకేష్ యువ నాయకత్వానికి నిజమైన ప్రతీక. వారి నాయకత్వంలో టీడీపీ కొత్త ఉత్సాహంతో, కొత్త జీవనాడితో ముందుకు సాగుతుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మల్యాద్రి మాట్లాడుతూ, లోకేష్ నియామకం టీడీపీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. యువ నాయకత్వం ద్వారా పార్టీ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది. 2029 ఎన్నికల్లో విజయం సాధించడానికి మేమంతా కృషి చేస్తాం అని ఆనందం వ్యక్తం చేశారు. లోకేష్ దూరదృష్టి, యువతకు ఇచ్చే ప్రాధాన్యతతో పార్టీ మరింత బలోపేతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చిరాంప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, రాష్ట్ర కార్యదర్శి కోడూరు అఖిల్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ ఏవీ రమణ, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం, అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్, జోన్-5 ఇన్‌చార్జి ఎల్ఐసీ నరసింహులు తదితర నేతలు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయం బయట కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి అధ్వర్యంలో స్వీట్స్ పంచి, బాణాసంచా కాల్చి ఘనంగా సంబరాలు చేసుకున్నారు.

# పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా హోం మంత్రి అనిత

**- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన హోం మంత్రి**



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరోకు మళ్లీ ఎంపిక కావడం పట్ల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పట్ల తన విధేయతను, అంకితభావాన్ని గుర్తించి మరోసారి ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్‌కు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని, పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. విధేయతకు ప్రాధాన్యతనిస్తూ, సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేసిన ఈ కొత్త కమిటీలు పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

# మే 01 నుండి 09 వరకు న్యూఢిల్లీ శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**- భక్తిరసముతో విరాజిల్లనున్న దివ్య ఉత్సవాలు**



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మే 01 నుండి 09వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఏప్రిల్ 30న అంకురార్పణం జరుగనుంది.బ్రహ్మోత్సవాల ముందు భాగంగా ఏప్రిల్ 28న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహిస్తారు. మే 01వ తేదీ రాత్రి 09.00 గంటల నుండి 10.30 గంటల మధ్య మిధున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8.00 నుండి 9.00 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 10వ తేదీ సాయంత్రం 6.00 నుండి రాత్రి 8.00 గంటల వరకు పుష్పయాగం నిర్వహించబడుతుంది.

### వాహన సేవల వివరాలు

- 01-05-2026 -- ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం
- 02-05-2026 -- ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం
- 03-05-2026 -- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం
- 04-05-2026 -- ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం
- 05-05-2026 -- ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం
- 06-05-2026 -- ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం
- 07-05-2026 -- ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం
- 08-05-2026 -- ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం
- 09-05-2026 -- ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం.

ఈ దివ్య బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపను పొందాలని భక్తులను కోరుతున్నారు.

# దివ్యంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



**నాచారం(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా, వారిని చిన్నచూపు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరు దురదృష్టకరమని ఉస్మానియా యూనివర్సిటీ దివ్యంగా విద్యార్థులు అన్నారు. విద్య ఉద్యోగ అంశాలలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఓయూ ఆర్ట్స్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ తో పాటు తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయంలో దివ్యాంగ విద్యార్థులకు సరైన అవకాశాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే అదే నెల నుంచి దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచుతామని, రాష్ట్రంలో దివ్యాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పి హామీలు నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు కొల్లగొట్టి గద్దెనెక్కారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చేర్చిన దివ్యాంగుల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం, మోరిగాడి నరసింహ గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు మక్కా ఉపేందర్, డాక్టర్ అ అశోక్, పరిశోధక విద్యార్థి ఆంజనేయులు గౌడ్, మారవేణి చంద్రశేఖర్, బుచ్చి రాములు, వేణు గౌడ్, ధనమ్మ, కరుణాకర్, వెంకటేష్, జగన్ వెంకట్ తదితర దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినుల ప్రభంజనం



**నాచారం(ప్రశ్న న్యూస్)** ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ మల్కాజిగిరి గురుకుల కళాశాల -I కి చెందిన విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. రెండవ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని శ్రావ్య, మహిశ్రీ లు 1000 మార్కులకు గాను 990 సాధించగా, యశ్విత 980 మార్కులు సాధించింది. బై.పీ.సీ విభాగంలో 1000గాను మహియ 965 మార్కులు సాధించగా, సంజన 927 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీ లో 470 మార్కులకు గాను శరణ్య 461, షైక్ ఆసిఫా 458 లు సాధించారు. బైపీసీ విభాగంలో 440గాను సయ్యద్ షెస్తా 435, శ్వేత శ్రీ 433 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం 98 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్ మొదటి సంవత్సరం 92 శాతం చొప్పున ఉత్తీర్ణత నమోదు కావడం విశేషం. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డా.శైలజీ మాట్లాడుతూ విద్యార్థినుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యం అయ్యాయని తెలిపారు.

# ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



**నాచారం(ప్రశ్న న్యూస్)** నాచారం డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్, బీజేపీ ఉప్పల్ మహిళా కన్వీనర్ అనితా పద్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.మహిళలకు 33% రిజర్వేషన్ కల్పిస్తూ, దానికి చట్టబద్ధత ఇవ్వడానికి పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ పాలాభిషేకం నిర్వహించారు. మహిళలు ఎదురుచూస్తున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంపై మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జ్యోతి రెడ్డి,వరలక్ష్మి, దింపుల్, కల్పన, రమ,ఇందిరా, కాంత తదితరులు పాల్గొన్నారు

# బీఎస్పీ బహిరంగ సభ విజయవంతం




**నాచారం(ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సభ తో పాటు బీఎస్పీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం అయిందని బిఎస్పీ నేతలు జాతీయ రాష్ట్ర సమన్వయకర్త అత్తార్ సింగ్, ఉప్పల్ మున్సిపల్ మల్కాజ్గిరి పార్లమెంట్ జోన్ ఇంచార్జ్ రవీంద్ర నాయక్, మల్కాజ్గిరి పార్లమెంటు ఇంచార్జ్ అనిత రెడ్డి, గౌడ సుదర్శన్ లు వర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి రోజున గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ కు భారీ ఎత్తున బిఎస్పి కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతంలో నాయకుల, కార్యకర్తల కృషి సమిష్టిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఉప్పల్ ఇంచార్జ్ అప్పారావు, ఉప్పల్ అధ్యక్షుడు మింద్రాల నర్సింగరావు, అనిత లు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**- జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ యాక్షన్ ప్లాన్ పై సమీక్ష**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పథకాలకు నిబంధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన " డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ" సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీ యాక్షన్ ప్లాన్-2025-26 కి సంబంధించిన అంశాలు, మండలవారీగా లక్ష్యాలను కమిటీ ముందు ప్రవేశ పెట్టి వారి సంయుక్తంగా ఆమోదం పొందటం జరిగింది. అలాగే లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 గైడ్ లైన్స్ ప్రకారంగా "మండలస్థాయి ఎంపిక కమిటీ"ని ఏర్పాటు చేశారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కింద వ్యవసాయ రంగం ( సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్), పశు పోషణ రంగం ( 2 మిల్క్ అనిమల్స్), రవాణా రంగం ఈవీ త్రీ వీలర్స్ (గూడ్స్), ఈవీ త్రీ వీలర్స్ (ప్యాసింజర్స్), ఈవీ టు వీలర్స్ పరికరాలు సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ లబ్ధిదారుల, మండల స్థాయిలో లక్ష్యాల కేటాయింపు అన్నీ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయాలని తెలియజేశారు. సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జనరల్ మేనేజర్ (జిల్లా పరిశ్రమలు) హనుమంతు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ లో "500" మీటర్లకు చలివేంద్రిలు: ఎమ్మెల్యే శ్రీ గణేష్

**- సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో నుంచి దాదాపు సగటున లక్షల్లో ప్రజలు ప్రయాణం కొనసాగిస్తున్నారు**

**- వేసవిని దృష్టిలో ఉంచుకుని రెండు ప్రధాన రహదార్లు, అంతర్గత దారుల పై చలివేంద్రలు ఏర్పాటు**

**- రోజు రోజుకు పెరిగి పోతున్న ఎండలు,అల్లాడిపోతున్న ప్రజలు,గ్లాసు మంచినీళ్లతో సేదతీరుతున్న వాహన దారులు.ముప్పిడి**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండి పోతున్నాయి.నలష్పై రెండు డిగ్రీలు దాటిన ఎండ తీవ్రత, వయోవృద్ధులు,పసిపిల్లలు, వివిధ రుగ్మతలతో బాధపడుతున్న రోగులు ఘరిమీని దృష్టిలో ఉంచుకుని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాతవరణ శాఖ,వైద్యులు సైతం హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న రెండు రహదారులు 1)రాజీవ్ రహదారి 2) నాగ్ పూర్ రహదారి, అంతర్గత రోడ్లులల్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు,రాజకీయ నాయకులు తదితరులు.గతకొన్ని రోజులగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చలివేంద్రాలను ఆయన స్వచ్ఛంద సంస్థ శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే తనయుడు ముకుల్ తో పాటు ఆయన కూడా చలివేంద్రాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం బోయిన్ పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీగణేష్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని వేసవి కాలంలో ప్రయాణీకులకు, బాటసారులకు ఉపయోగపడే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుకర్ బోయిన్ పల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి తాను ప్రారంభించడం సంతోషంగా ఉందని, సమాజం పట్ల బాధ్యతతో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టిన మధుకర్ ని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని,ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బల్వంత్ రెడ్డి,మార్కెట్ కమిటీ సభ్యులు శరత్,జిల్లా కాంగ్రెస్ సెక్రటరీలు సదానంద్,కిరణ్, హరి కృష్ణ,మారుతి గౌడ్, గోమతి,అబీద్,అమీర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భాజపా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**- భాజపా గంగాధర మండలాధ్యక్షులు : పంజాల ప్రశాంత్ గౌడ్**

**- గంగాధరలో బీజేపీ మండల నూతన కమిటీ ఏర్పాటు**



**గంగాధర (ప్రశ్న న్యూస్)** భారతీయ జనతా పార్టీ గంగాధర మండల నూతన కార్యవర్గాన్ని కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు గంగాధర మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ గౌడ్ ప్రకటించారు. పార్టీ కార్యకలాపాలను గ్రామ స్థాయిలో విస్తరించే దిశగా ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.మండల కమిటీలో ఉపాధ్యక్షులుగా గంకిడి చంద్రారెడ్డి, గుండెల్ని మల్లేశం, బొమ్మకంటి రాజిరెడ్డి, హర్ష రాజు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా తాళ్ల రాజశేఖర్, రేండ్ల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యదర్శులుగా గాలిపెల్లి శ్రీనివాస్, జాతరకొండ మహేష్, జోగు అజయ్, సుద్దాల వంశీ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. కోశాధికారిగా ఆది పెల్లి పృథ్వి ఎంపికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా మల్యాల పోచయ్య, పుల్కం లక్ష్మణ్, బత్తిని శ్రీధర్, బట్టు చంద్రశేఖర్, గంగాధర రవి, పబ్బతి వెంకటరెడ్డి, వోడ్నాల లక్ష్మణ్, గుంటకు రవీందర్, గాలి పెల్లి కిరణ్, బైరి ప్రభాకర్ రెడ్డి లకు బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ మాట్లాడుతూ, నూతన కమిటీ సమన్వయంతో పనిచేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

# గంజాయి మత్తులో మునిగిపోతున్న యువత

- కల్వకుర్తిలో ఆందోళనకర పరిస్థితి
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం
- ఎక్సైజ్, పోలీస్ అధికారుల కఠిన చర్యలు ఎప్పుడు.?
- ప్రధాన సూత్రధారులను పట్టుకోవడంలో విఫలం ఎందుకు.?



**నాగర్ కర్నూల్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** గ్రామాల దాకా విస్తరించిన గంజాయి మాఫియా కల్వకుర్తి పట్టణంలో యువత గంజాయి మత్తుకు బానిసవుతున్న పరిస్థితులు రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలు,రాత్రి తేడా లేకుండా యువత గంజాయి సేవిస్తూ తూలిపోతుండటం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. పట్టణాల నుంచి మండలాలు, గ్రామీణ ప్రాంతాల వరకూ గంజాయి సరఫరా దర్జాగా విస్తరించడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఈ గంజాయి మాఫియా పై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే మత్తు బారిన పడుతున్న విద్యార్థులు 15 నుంచి 18 సంవత్సరాల లోపు విద్యార్థులే గంజాయి మాఫియా ప్రధాన లక్ష్యంగా మారారు. పాఠశాలలు, కళాశాలల వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి పాకెట్లను సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కో పాకెట్‌ను ?500 నుంచి ?600 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మత్తు అలవాటు పడిన యువత చదువులపై దృష్టి పూర్తిగా కోల్పోయి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారు.

## ప్రమాదాల బారిన పడుతూ.. దాడులు చేస్తూ..

రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తున్న మత్తు అలవాటు గంజాయి మత్తులో ఉండి అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. మత్తుకు బానిసైన కొంతమంది యువకులు తమ తల్లిదండ్రులపై దాడులు చేయడం, తల్లిదండ్రులతో పాటు రోడ్లపై వెళ్లే వారి డబ్బులు లాక్కోవడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏకాంత ప్రదేశాల్లో గుంపులుగా మత్తు సేవనంకల్వకుర్తి పట్టణంలోని కొన్ని ఏకాంత ప్రాంతాలు గంజాయి సేవనానికి కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యంగా సాయంత్రం 5 గంటల తర్వాత యువత గుంపులుగా చేరి మత్తులో మునిగిపోతున్నారు. నిరుద్యోగ యువతతో పాటు చదువుకుంటున్న విద్యార్థులు కూడా ఈ మాయలో చిక్కుకుంటూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

## అన్ని వర్గాల యువతపై తీవ్ర ప్రభావం

గంజాయి మత్తు కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల యువతను ప్రభావితం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, కూలీ కుటుంబాల పిల్లలు ఇలా విభిన్న సామాజిక వర్గాల యువత ఈ మత్తుకు బానిసవుతున్నారు. ఈ పరిస్థితి సమాజ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ గంజాయి లభిస్తుందన్న సాంకేతాలు వినిపిస్తున్నాయి దానితో యువత ఒకరి నుండి ఒకరి ద్వారా ఈ మత్తుకు బానిస అవుతున్నారు.

## కల్వకుర్తి పట్టణం గంజాయి కేంద్రంగా మారిందా.?

గతంలో గుడుంబా, నాటు సారాకు కేంద్రంగా పేరుగాంచిన కల్వకుర్తి ఇప్పుడు గంజాయి సరఫరాకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి గంజాయి యదేచ్ఛగా తెచ్చి రహస్యంగా విక్రయాలు చేస్తున్న ముఠాలు పట్టణంలో బ్యాచ్‌లుగా ఏర్పడి పోటీగా వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయితే విద్యార్థులే లక్ష్యంగా ఈ ముఠాలు పనిచేస్తున్నాయని సాధారణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఆశించిన స్థాయిలో విధులు నిర్వహించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటిని కట్టడి చేయడానికి ప్రత్యేక చర్యలు ముఖ్యమని సూచిస్తున్నారు.

## పోలీసుల చర్యలు సరిపోవట్లేదా.?

పోలీసులు అప్పుడప్పుడు గంజాయి పట్టుకుంటున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు, సరఫరా మాత్రం ఏమాత్రం ఆగడం లేదు. ప్రధాన సూత్రధారులను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్సైజ్, పోలీసులు గంజాయి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని వాస్తవానికి పోలీసులు తలుచుకుంటే 24 గంటల్లో కల్వకుర్తి పట్టణంలో గంజాయి అమ్మే ముఠాలు ఒక్కటి కూడా ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలే పరిష్కారం అన్న సంగతి పోలీసులు మర్చిపోవడంతో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ఎక్సైజ్, పోలీసు అధికారులు మాఫియా అసలు నెట్వర్క్‌ను బయటపెట్టి గంజాయి అమ్మకాలను పూర్తిగా నిర్మూలించాలని, యువతను ఈ ప్రమాదకర అలవాట్ల నుంచి దూరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


### యువత భవిష్యత్తును యువతే కాపాడుకోవాలి

మంచిగా చదువుకునే వాళ్లను కొంతమంది ఓర్వలేక వాళ్లకు మత్తులోకి దించడం చేస్తున్నారని, చదువు, ఉద్యోగం, కుటుంబం గురించి ఆలోచించాల్సిన వయసులో యువత గంజాయి మత్తులో దారి తప్పడం సమాజానికి నష్టం కలిగించే పెద్ద హెచ్చరికగా మారింది.

ప్రభుత్వం పోలీసు, ఎక్సైజ్ యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోకపోతే కల్వకుర్తి ప్రజలు మరింత తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అధికారులు మేల్కొని కఠిన చర్యలు తీసుకుంటేనే యువత జీవితాల్లో వెలుగు నింపగలమని తల్లిదండ్రులు, ప్రజలు ఆశిస్తున్నారు.

# ఎల్లంపేట పురపాలక సంఘం 'ప్లాన్' ప్రకారం దోపిడీనా.?

- క్షేత్రస్థాయిలో విస్మయం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాలకు టీపీఓ అండదండలు ఉన్నాయా.?
- ప్రశ్నిస్తే 'లెటర్' డ్రామా.. బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట
- ఉన్నతాధికారులు మేల్కొనేది ఎప్పుడు.?
- విచారణ కోరుతున్న స్థానికులు






మేడ్చల్ (ప్రశ్న న్యూస్) అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఎల్లంపేట పురపాలక సంఘం మారుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, అనుమతులు లేకుండానే భారీ భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగం అండదండలతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇంచార్జ్ టీపీఓ సుకన్య తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి ఆమె కనుసైగల్లోనే జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ప్రభుత్వ ఖజానాకు కన్నం.. అధికారుల జేబులు నిండుతున్నాయా.?



పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారంతో అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఒక్కో భవనం నుండి రావాల్సిన లక్షలాది రూపాయల ఫీజులను ఎగవేస్తూ, అధికారుల సహకారంతో నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా, టీపీఓ సుకన్య కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'ముడుపులు' ముట్టాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారిణి, వాటికి రక్షణ కవచంలా మారడం పురపాలక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ప్రశ్నిస్తే 'లెటర్' డ్రామా.. బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట

క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిని ఎండగట్టేందుకు వెళ్లిన పాత్రికేయుల పట్ల టీపీఓ సుకన్య వ్యవహరిస్తున్న తీరు గర్హనీయం. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వివరణ కోరితే.. సమాధానం చెప్పలేక, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి లిఖితపూర్వకంగా రాసి ఇవ్వండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, అక్రమాలను ప్రశ్నించిన వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం ఆమె విధి నిర్వహణలో వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

## ఉన్నతాధికారులు మేల్కొనేది ఎప్పుడు.?

ఎల్లంపేట పురపాలక సంఘంలో అక్రమ నిర్మాణాల జోరు చూస్తుంటే, అసలు ఇక్కడ పురపాలక చట్టం అమలవుతుందా లేదా అన్న సందేహం కలుగుతోంది.

టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న ఈ భారీ కుంభకోణంపై జిల్లా కలెక్టర్, పురపాలక కమిషనర్ తక్షణమే స్పందించి టీపీఓ సుకన్యపై శాఖాపరమైన విచారణ జరిపి, తక్షణమే ఆమెను విధుల నుంచి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# పెయ్య దుడ్డెను చంపి తిన్న చిత్రగండు



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) చిత్రగండు పెయ్యదుడ్డేను చంపి తిన్న ఘటన పోతిరెడ్డిపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. దీంతో ఆ పల్లె ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సదుల పూర్ణ, సాయిలు అటవి శివారు ప్రాంతంలో నివసిస్తున్నారు. తమ గుడిసెల వద్ద బర్రెను, పెయ్య దుడ్డెను కట్టేయగా తెల్లవారుజామున లేచి చూసేసరికి పెయ్యదుడ్డెను చిత్రగండు చంపి తిని వెళ్లిపోయింది. దీంతో ఆ నిరుపేద కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించారు. చనిపోయిన పెయ్య దుడ్డెకు డాక్టర్ రాహుల్ అసిస్టెంట్ సర్జన్ వెటర్నరీ పోస్ట్ మార్టం నిర్వహించారు. పెయ్య దుడ్డె కళేబరాన్ని దగ్ధం చేశారు. ఫారెస్ట్ అధికారిని అనూష బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ పశువులను అటవీ పరిసర ప్రాంతాల్లో కట్టివేయవద్దని, ప్రజలు సాయంత్రం సమయాల్లో అడవిలోకి వెళ్ళవద్దు అన్నారు. క్రూర జంతువులు సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిరుపేద కుటుంబానికి పరిహారం అందించాలని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు కోరారు.

# ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- తమ మాట విని చైనా వెనక్కి తగ్గిందన్న ట్రంప్



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) ఇకపై ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపబోమని చైనా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు చైనా మద్దతు తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "ఇకపై హర్మూజ్ ను మూసి ఉంచడం జరగదు. హర్మూజ్ జలసంధిని నేను శాశ్వతంగా తెరుస్తుండటం చైనాకు చాలా సంతోషాన్నిచ్చింది. అమెరికాతో పాటు ప్రపంచం కోసం నేను ఈ పని చేస్తున్నాను. వారు ఇరాన్‌కు ఆయుధాలు పంపబోమని అంగీకరించారు" అని ఆయన రాసుకొచ్చారు.ప్రపంచ ఇంధన సరఫరాలో హోర్ముజ్ జలసంధి చాలా కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. మరోవైపు, చైనా ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తోందంటూ గతంలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకున్న సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. "నేను చైనా వెళితే అధ్యక్షుడు షీ జిన్ పింగ్ నన్ను గట్టిగా ఆలింగనం చేసుకుంటారు. మేమిద్దరం కలిసి తెలివిగా పనిచేస్తున్నాం. ఇది యుద్ధం కన్నా మంచిది కదా?" అని వ్యాఖ్యానించారు. అయితే, అవసరమైతే యుద్ధానికి కూడా అమెరికా సిద్ధమేనని హెచ్చరించారు.కాగా, అమెరికాతో ఇరాన్ చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం నెరుపుతున్నప్పటికీ, ఇరాన్ ను చర్చల వరకు తీసుకురావడం వెనుక చైనా హస్తం ఉందని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. తెరవెనుక చైనా మంత్రాంగం నడుపుతోందని భావిస్తున్నారు. ఈ క్రమంలో, ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# నా కారునే తనిఖీ చేస్తారా.?

- కేంద్ర బలగాలపై మమత ఫైర్



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేంద్ర బలగాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం కోల్‌కతా విమానాశ్రయానికి వెళుతుండగా, తన కారును తనిఖీ చేసేందుకు కేంద్ర బలగాలు ప్రయత్నించాయని ఆమె ఆరోపించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని ఇస్లాంపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత ఈ విషయంపై మాట్లాడారు. "ఈరోజు డం డం విమానాశ్రయంలో నా కారును తనిఖీ చేయడానికి కేంద్ర బలగాలు వచ్చాయి. నేను తనిఖీ చేసుకోమని చెప్పాను. కానీ వారు భయంతో పారిపోయారు. నా కారును తనిఖీ చేస్తే నాకు సంతోషమే. నేను దొంగను కాదు, దోపిడీదారును కాదు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జీతంగా తీసుకోను" అని ఆమె అన్నారు. అంతేకాకుండా, "టీఎంసీ నేతల కార్లనే ఎందుకు తనిఖీ చేస్తున్నారు? ప్రధాని, హోంమంత్రి, బీజేపీ నేతల వాహనాలను ఎందుకు తనిఖీ చేయరు? ఈ ఎన్నికలు ఎందుకు ఇలా జరుగుతున్నాయి?" అని ఆమె ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు, వారి కుటుంబ సభ్యుల వాహనాలను తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని టీఎంసీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం గమనార్హం. పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య వాహనాలను కూడా తనిఖీ చేయాలని ఆదేశాల్లో ఉన్నట్లు టీఎంసీ మంగళవారం ఆరోపించింది. ఈ సందర్భంగా మమత మరిన్ని సంచలన ఆరోపణలు చేశారు. "కేంద్ర మంత్రులు డబ్బులు తీసుకొస్తున్నారు. కేంద్ర బలగాల వాహనాల్లో ఏం వస్తుందో నాకు తెలుసు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి కార్డులు పంచుతూ ఆర్థిక హామీలు ఇస్తున్నారని, ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588